శ్రీరస్తు.

# స్వాతంత్ర్య వీరుడు

## (ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్ర)

పద్యకావ్యము

కర్త:

పాణ్యం నరసరామయ్య

శ్రీ కైలాస్ ప్రింటింగ్ ప్రెస్. కడప.

శ్రీరస్తు.

# స్వాతంత్ర్య వీరుడు

## (ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్ర)

పద్యకావ్యము

కర్త:

పాణ్యం నరసరామయ్య

సర్వస్వామ్య సంకలితము.

---

ప్రతులకు:

పాణ్యం నరసరామయ్య,
ఉయ్యాలవాడ పోస్టు,
కోవెలకుంట్ల తాలూకా,
కర్నూలు జిల్లా.

(లేక)

కర్నాటి అయ్యపురెడ్డి,
రూపనగుడి పోస్టు,
కోవెలకుంట్ల తాలూకా,
కర్నూలు జిల్లా.

వెల రూ. **2-00**



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

మ॥ అమితోద్దండ దురంతపీడనకులోనై, భారతీయ ప్రజా
సముదాయం బొనరించినట్టి ప్రథమ స్వాతంత్ర్యసంగ్రామరం
గముకన్నంబదియేండ్లకున్మునుపె యాంగ్ల ప్రాజ్య
సామ్రాజ్య సై
న్యముపై గత్తి నిదూసినట్టి "నరసింహారెడ్డి" సామాన్యుఁడే॥

సీ॥ కలికి తురాయి గీల్కొలుపు పట్టురుమాలు
గట్టిన యుత్తమాంగంబుతోడ
వైష్ణవభక్తి భావముచాటు నూర్ధ్వపుం
డ్రము నీటుగొలుపు ఫాలంబుతోడ
క్రేవలకెంజాయరేకలింపారు, నా
తతదీర్ఘ ధవళనేత్రములతోడ
చిఱునిమ్మకాయల నిరుపైపునిల్పుకో
జాలినగుబురు మీసములతోడ॥

గీ॥ వైరిహంవీర విదళన ప్రళయకాల
దండనిభ ఖడ్గకలిత హస్తంబుతోడ
ప్రజలకు భయభక్తి సంభ్రమ భావములను
గొలుపువర్చస్సుతోడ నబ్బలియుఁడలరు॥

# అంకితము

గీ॥ నాకు నాకావ్యగత కథానాయకునకు
నిష్టదైవము గృహదైవమై వెలుంగు
శ్రీ అహోబల లక్ష్మినృసింహమూర్తి
పాదుకలకేను దీని నర్పణమొనర్తు॥

గ్రంథకర్త.

# పరిచయము

పూజనీయులు శ్రీ పాణ్యం నరసరామయ్యగారు "వీర కంకణ" కావ్యకర్తలుగా లబ్ధప్రతిష్ఠులై యున్నారు. భగవాన్ శ్రీ రమణ మహర్షి అంతేవాసులు, ఋషితుల్యులు, మహాకవులు నైన వీరిని పరిచయము చేయఁబూనుట నావంటి అల్పజ్ఞునికి సాహసమే యగును. కాని మాకు ఆత్మీయతచేత వీరు నాయెడ వాత్సల్యము చూపుచు భారతస్వాతంత్ర్య సమరయోధుఁడు శ్రీ నరసింహారెడ్డి చరిత్రమునకు పరిచయవాక్కులు వ్రాయుమని నన్ను కోరిరి. వీరి ఆదేశము నాకు శిరోధార్యమై యీ సాహస కార్యమునకు నన్ను ఒడిగట్ట చేసినది.

కావ్యతీర్థులు శ్రీ జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మగారు వీరకంకణ కావ్యమందు ఆశంసనమున నుడివియున్నట్లు యీ కవి వతంసుడు రాయలసీమకవి రాయలసీమ యనునట్లుగ ముద్దుల మూటగట్టు పద్యరత్నములను తన కావ్యమున పొందుపఱచి ఆంధ్రభోజునకు ముచ్చటలూరించు నీసీమకీర్తిని వెలయించినారు.

ఈ కవితల్లజుఁడు ఆశించినటులే నరసింహారెడ్డి చరిత్రమున వీరి "మనోభవనంబందు వసించుచున్న పరబ్రహ్మంబు విద్వజ్జన ప్రవరామోదకరోత్తమోత్తమ కవిత్వప్రౌఢియై" భాసించుచున్నది.

పరతత్వమూర్తి, సచరాచరవర్తి, యశేష భక్తజన సంసృతి సాగర తరణ ప్రవణుఁడునగు శ్రీ రమణమహర్షి కృపకు పాత్రులైన వీరి కవిత అట్లు భాసించుట సహజమేకదా!

శ్రీ నరసరామయ్యగారు కృతికర్త, కథానాయకుఁడు శ్రీ నరసింహారెడ్డి, వీరిరువురిది ఒకే గ్రామము-ఉయ్యాలవాడ-కవి యిలువేలుపు అహోబల నరసింహస్వామి. నరసింహారెడ్డి నరసింహ దైవతంబును స్మరియించుచు యుద్ధమునకు బయలు దేరుటచే అతని ఇలువేలుపుకూడ నరసింహస్వామియే అని విదిత మగుచున్నది. ఇట్లు కథానాయకునియొక్కయు, కవియొక్కయు నామములందును. ఇష్టదైవములయందును ఐక్యమొప్పి వారిరువురు నొకే గ్రామమునకు చెందినవారగుట విచిత్రమైన దైవఘటన కానోపును కదా! శ్రీ నరసింహారెడ్డిగారివంటి స్వాతంత్ర్యయోధుల కును, శ్రీ నరసరామయ్యగారివంటి కవులకును, శ్రీ బుడ్డా వెంగళ రెడ్డిగారివంటి త్యాగధనులకును నిలయమై యొప్పు ఉయ్యాలవాడ రాయలసీమ సీమంతిని కంఠసీమనలరారు రత్నాల హారమందలి రాజనీలమై రాణించిన దనుట అతిశయోక్తిగాదు.

వీరకంకణమును - నరసింహారెడ్డి చరిత్రమును చదివిన పాఠకులకు ఇవిరెండును ఏకకర్తృకములా యను సందేహము పొడ

సూపకపోదు. ఏలయన నీ రెండుకావ్యముల శైలిలో కవిపోకడ యందు భిన్నత్వము స్పష్టముగ గోచరించును. వీరకంకణము కొంత ప్రౌఢమై పండిత జనానందకరమై యొప్పగా నరసింహారెడ్డి చరిత్రము పండితపామర జనానందకరమై అలరారుచున్నది. కవి యీ కావ్యమున భాషలోను, పద్యముల నడకయందును సారళ్య మును ప్రదర్శించిరి. ఈ రెండు కావ్యములవల్ల యీకవి సంస్కృ తాంధ్రములలో పుష్కలమైన పాండిత్యము, కవితలో నిండైన ప్రావీణ్యముకలవారని తేట తెల్లమగుచున్నది.

ఈ కవివరుడు తమ అవతారికలో తెల్పుకొన్నట్లు శివభారత శైలిని గుఱిగాఁగొని యీ కావ్యరచన సాగించుట కుద్యమించి కృతకృత్యులైనారు. నరసింహారెడ్డి దేహబలమును, ఆయన మనః ప్రవృత్తిని ఒక్కొక్కపద్యమున నెంతసరళముగను, మనోజ్ఞము గను వర్ణించిరో పరికింపుడు.

గీ॥ పుక్కిటను బట్టి యూదినమొరమురాళ్ళు
చెట్టుకొమ్మలపైనున్న పిట్టలకును
దవిలి కూలంగచేయునంతటి శరీర
బలము నార్జించె వ్యాయామకలనచేత॥

గీ॥ ఎంతయుద్ధండుఁడో యంతశాంతమూర్తి
యెంతటి శరుండొ యంతటి మృదుల హృదయుఁ
డెంతనిష్కృష్టభావుఁడో యంతవిశద
వర్తనుండు పరిస్థితినిఁబట్టి యతఁడు॥

అటులే నరసింహారెడ్డి నారసింగునికి గఱపిన హితవిట్లున్నది.

చ॥ మఱియొకరీతిఁ జూడు మన మాతృధరిత్రిని దోఁచుచున్నము
ష్కరులు బ్రిటీషువారి ధనసంచయముంబరిరక్ష సేయుటె
వ్వరయిన మెత్తురే? ప్రజలు బాగనబోని ప్రయత్నమందు ని
ష్ఠురముగ ప్రాణముల్ విడువఁజూచుటకన్నను వెఱ్ఱియున్నదే?

అట్లు పలికిన నరసింహారెడ్డికి నారసింగు సమాధానమును గనుడు.

గీ॥ జీతముఁగొని పోషకుల్ చెప్పినట్టి
పనినొకింతయు శక్తి వంచనము లేక
చేయుచుండుట యొక్కటే సేవకునకు
పరమధర్మంబుగా నేను పరిగణింతు॥

గీ॥ ఇంతకాలమునుండి యేతృణమొ పణమొ
వారినుండి గ్రహించి జీవనమొనర్చి
సమయ మేతెంచినప్పుడీ సాకుతోడ
జారుకొనుట మెత్తురే ధీరవరులు?

కోవెలకుంట్ల తహసీల్దారునితో నరసింహారెడ్డి "నినుం యమాలయద్వారముఁ జేర్తు నాడుకరవాలము నిచ్చెనగా నొనర్చి" అనుటలోను, ధనాగార సంరక్షకుఁడు, నిజోద్యోగ ధర్మైక పరాయణుఁడునైన నారసింగును చంపిన ఒడ్డె ఓబన్నతో "నీదు వర్తన దుడుకనరాదు. కాని, యింతసుజనుని మృతికి చింతింతు" ననుటలోను నరసింహారెడ్డి శౌర్యము, ఔచితి, సౌజన్యము పాఠకులు ఊహించగలిగినంత మేరకు భావగర్భితమై భాసిల్లు చున్నది.

అనవసరములైన వర్ణనలతో పాఠకులకు విసుగు జనింప నీయక కథను చక్కని శైలిలో సాఫీగా నడిపించుట, చిన్నచిన్న మాటలతో గంభీరభావముల వ్యక్తపరచి కథలోని ఆయా పాత్రలను పాఠకులయెదుట సాక్షాత్కరింపచేయుట, యనుశక్తి యీ కవికి దైవదత్తమైన సహజశక్తిగా చెప్ప నొప్పును. రసజ్ఞులైన ఆంధ్రపాఠక మహాశయులీ కావ్యమును చదివి అమందానందము నందఁగలరని ఆశింతును.

బుక్కరాయసముద్రం,
10-2-1973

ఇట్లు,
విద్వాన్: బి. నరసింహయ్య,
B.A., B.Ed.,

## అభిప్రాయము.

# శ్రీ పాణ్యం నరసరామయ్యగారికి

నమస్కారోభయకుశలోపరి

మీ "నరసింహారెడ్డి" కృతిని చదివినాను. మీ "వీరకంకణ" కావ్యానికంటె-ఆకృతిలో చిన్నదయినా గుణంలో మఱింత పరిణతి చెందిన దీ "నరసింహారెడ్డి" కావ్యం. వీరరసప్రధానమయిన కావ్యాలు వెలయించడంలో మీరు సిద్ధహస్తులు. మీ కవితా ప్రాగల్భ్యాన్ని గుఱించి నా అనందాన్ని మఱలా ఒకసారి యీ విధంగా స్మరిస్తున్నాను.

"అలరుల తావినూని మలయానిల మల్లన వీచుచుండ, వె
న్నెల నును(గాంతిలోఁ బ్రణయినీ పరిరంభ సుఖానుభూతిలో
కలిగిన హాయియిట్టిదనఁగా వివరించుట కల్గెనేని-మీ
యలఘు కవిత్వతత్త్వమది యట్టిదయంచు వచింపఁగానగున్"

దానకర్ణుఁడైన బుడ్డా వెంగళరెడ్డికిని బ్రిటీష్ ప్రభుత్వమును గడగడలాడించిన వీర నరసింహారెడ్డికిని - వీరరసాంచిత కావ్య నిర్మాతలైన మీవంటి కవులకును ఆటపట్టయిన ఉయ్యాలవాడ గ్రామం ప్రశస్తి కెక్కుటలో వింతఏమున్నది.

మీకు సకల శుభములు పరమేశ్వరుఁడు ప్రసాదించునుగాక.

అనంతపురం, 10-2-73

భవదీయుడు,
గొల్లాపిన్ని రామకృష్ణశాస్త్రి.

ప్రొద్దుటూరు,
10-5-73.

శ్రీ పాణ్యము నరసరామయ్యగారికి ఆశీస్సులు.

మ॥ అమృతప్రాయము తెల్గుబాస, నరసింహారెడ్డిదౌ దివ్యకా
వ్యము, "పాణ్యం నరసింహరామయ" తదీయాఖ్యాన సంధాత, యో
గ్యములౌ భావపదార్థ సంక్రమదలంకారంబులన్ హృద్యప
ద్యముల న్నింపినకైత, యీ ప్రజలపుణ్యంబెన్న సామాన్యమే॥

ఉ॥ చాలునయా! నృసింహపద సత్కృత రామకవీంద్ర! నీదుప
ద్యాలోకవందవేయి సుకృతంబులునౌ పదివేలు జాతిర
త్నాలు, తెలుంగునేలఁ గవితాకళ నీవొక చక్రవర్తివై
శ్రీలనెసంగుమీ! నలువచేడియనిన్నుఁ గృతార్థుఁజేయుతన్॥

ఇట్లు,
గడియారము వేంకటశేషశాస్త్రి.

---

శ్రీ నరసరామయ్యగారికి:

మీరుపంపిన "ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్ర" కావ్యం అందింది, ఇది చక్కని వీరగాథ. రాయలసీమవాసులకు వన్నె తెచ్చునట్టిది.

ఇట్లు,
కె. సుబ్బరామప్ప. M.A., B.Ed., B.O.L.,
ఆంధ్రశాఖాధ్యక్షులు, మైసూరు విశ్వవిద్యాలయము.

30-4-73

శ్రీ నరసరామయ్యగారికి:

మీరు చెప్పుటయేకాదు, నాకుగూడ ముఖస్తుతి మనస్కరింపదు. వాస్తవము నాకు దోచిన యభిప్రాయమును సూక్ష్మముగ బంపుచున్నాను. స్వీకరింపవలయును.

క॥ ఉచితమొనర్చితి వాఖ్యా
నచతుర! ఉయ్యాలవాడ నరసింహా రె
డ్డి చరిత్ర, పద్యకావ్యము
రచియించుటఁజేసి, నరసరామ మనీషీ॥

గీ॥ క్రితముననె, వీరకంకణాంకితము నీదు
కలమసామాన్య హృదయసంస్కారహలము
అదనునకుడాసి సరసంపు పదునుచేసి
మనుగడలజాటు మంచివిత్తనమునాటు॥

ఇట్లు,

26-3-73. జోస్యము జనార్దనశాస్త్రి.

మీ కావ్యము చదివితిని. ముదావహముగా నున్నది. ఉయ్యాలవాడ నిజముగా విరాధివీర యశఃకన్యకాలలామలకు ఉయ్యాలవాడయే యనుట సత్యము.

క॥ చక్కని కవితాకన్యక
నిక్కవముగ నమరెమీకు నెమ్మదిప్రీతిన్
చక్కనికృతి యిదిమంచిది
చొక్కపు నిజదేశభక్తు చొప్పుందెలిసెన్॥

మ॥ అలబుడ్డాన్వయవార్ధిసోము చరితం-బల్లంత ప్రాయంబునన్
లలిత ప్రౌఢిమ తందనాలకథ, గాలాసై్యకరూపంబుగా
బలవచ్ఛూరుల దేశభక్తులను చెప్పన్ వింటిమేగాని, యీ
బలవంతున్నరసింహు దెల్పితిరి మీవాక్యోన్నతిన్ మెచ్చితిన్॥

ఇట్లు,

విద్వాన్, వైద్యవిద్వాన్, పర్వతంత్ర స్వతంత్ర విద్యానిధి, కవీశ్వర

10-3-73. గొల్లాపిన్ని వాసుదేవశాస్త్రి.

## కావ్యము(గూర్చి నామాట

శ్రీ యుతులు పాణ్యం నరసరామయ్యగారి కృతులు "వీరకంకణము" "స్వాతంత్ర్య వీరుఁడు" అనునవి రెండును నా పర్యవేక్షణక్రింద ముద్రింపఁబడిన వగుటచే నాకత్యంత సన్నిహితములు. రెండును వీరరసోదంచితములే. ఒకటి స్వామి భక్తి ప్రేరితము, రెండవది దేశభక్తి పురస్కృతము. ఈ కావ్యము సశేషమగుటచే లక్ష్యసిద్ధి పర్యవసానమున నెట్లగునో తెలియదు. కాని సాధనలోను, సాహసములోను ఈ కథానాయకుఁడు మొదటి విశ్వనాథనాయకునివలె దీక్షాబద్ధుఁడు, కొండను ఢీకొని బ్రద్దలు గొట్టు పౌరుషసాధనలు గలవాఁడు. కావ్యము సరళమై హృదయంగమమై పాఠకుని సద్యః పరనిర్వృతి నొందించి తల యూపించఁగలది. సామాన్యుఁ డర్థము చేసికోలేని పదమంటు వెదకినం దొరకదు.

కావ్యము ప్రత్యక్షర రమణీయము, ప్రతి పద్యహృద్యమునై యొప్పారుచున్నది. కాని ఇది యిప్పటి కసమగ్రమగుట సంతృప్తి సన్నిహితము గాకున్నది. దానిని త్వరితగతిని పూరించి పాఠకుల నానందపూరిత మనస్కులఁ జేయుదురని కవిని వేడుకొనుచున్నాను. వారి యిష్టదైవమగు శ్రీ మదహోబల నాథుడు వారికాయురారోగ్య సంపదలనిచ్చి సారస్వత సేవ మిక్కిలిగాఁ జరిగించుచుండును గావుత.

కడప,
22-6-73

విద్వాన్, వెల్లాల సుబ్బయ్య,
తెనుఁగు పండితుఁడు, శ్రీ శారదా నిలయోన్నత పాఠశాల.

శ్రీరస్తు.

శ్రీ లక్ష్మీనృసింహ పరబ్రహ్మణేనమః

అవిఘ్నమస్తు.

❋

క॥ శ్రీమదహోబల మంజుల
ధాముని లక్ష్మీనృసింహు త్రయ్యంతవధూ
సీమంత కుంకుమాంకితు
మామకగృహదైవతంబు మదిభావింతున్॥

మ॥ అవతంసీకృత చంద్రశాఖకము-వామార్ధాంగ శుద్ధాంతమున్
పవనాంధఃపతి కంకణంబునగు రూపంబూని-యస్మన్మనో
భవనంబందు వసించుచున్న పరమబ్రహ్మంబు-విద్వజ్జన
ప్రవరామోదకరోత్తమోత్తమ కవిత్వప్రౌఢి, భాసించుతన్॥

క॥ పరతత్వమూర్తి సచరా
చరవర్తి - యశేషభక్తజన సంస్తుతి సా
గరతరణ ప్రవణుండగు
గురుదేవుని - రమణమౌనికుంజరుఁ దలఁతున్॥

క॥ ఉత్తమకవితాగుణ సం
పత్తి కిఁగాణాచియౌచు పాఠకకోటీ
చిత్తంబులలోఁగొను రస
వత్తర శివభారతంబు భావింతు మదిన్॥

క॥ అరుదైన తత్కవిత్వము
గుఱిగాఁగొని - నాదుశక్తి కొలఁది రచింపన్
దొరకొంటి వీరలోకో
త్తరుఁడగు "నరసింహరెడ్డి" ధన్యచరిత్రన్॥

# విన్నపము.

మ॥ అమిత ప్రాభవసర్వసైన్యసముపేతాంగ్లేయసామ్రాజ్య సిం
హము మీసల్ నులిపెట్టిలాగుచు నుదగ్రాటోపవీరోచితో
ద్యమసంరంభమొనర్చినట్టి "నరసింహారెడ్డి" కాస్థాన రం
గముగా భూరియశంబుగాంచినది మా గ్రామంబు
పూర్వంబునన్॥

ఒకప్పుడు మాగ్రామములోజరిగిన రైతుమహాసభలో స్వాగతో పన్యాస సందర్భమున ఉపర్యుక్తమగు పద్యము నుడివియుంటిని. అప్పుడా సభనలంకరించియుండిన శ్రీయుత కల్లూరు సుబ్బారావు గారును, కీర్తిశేషులు కళా వెంకటరావు, దామోదరం సంజీవయ్య గారలును పై పద్యముచే నాకర్షితులై, సభ సమావేశానంతరము నన్ను తమవిడిదికి పిలిపించుకొని నరసింహారెడ్డినిగురించి వివరము లడిగి నావలన తెలిసికొని అంతటి స్వాతంత్ర్యోద్యమ వీరునిచరిత్ర వెలుగులోనికి రాక కాలగర్భమున కలిసిపోయినందులకు తమ విచారము వెలిబుచ్చిరి. అంతేగాక నేను వారికడ కేగుటకుమునుపే స్థానికులగు కొందరు పెద్దలు నన్నుగురించి నాయోగ్యతకు మించి చెప్పియుండుటచే నరసింహారెడ్డి చరిత్ర కావ్యముగా మీరేల వ్రాయ

లేదని ప్రశ్నించి వ్రాయుమని నన్ను కోరిరి. అందుకు నరసింహా రెడ్డిని గురించినప్రామాణికాధారములు సమగ్రములుగా లభింప లేదని చెప్పి, కావ్యనిర్మాణమున కవసరములగు ప్రతిభావ్యుత్పత్తుల విషయమున నాపేదరికమును కప్పి పుచ్చుకొంటిని. మఱియు నేనేవో యితరవ్యాసంగములతో జీవితయాత్ర సాగించుచుండు వాఁడనగుటవల్ల కావ్యరచన కనుగుణమగు మనఃప్రవృత్తియు నాకు లేదు. కాని నరసింహారెడ్డితో సన్నిహిత బాంధవ్యముకలవారు, మాసమీప గ్రామీయులు, ప్రముఖులు, విశేషించి నాకు మిత్రులు నగు రూపనగుడి గ్రామమునసబు, శ్రీయుత కర్నాటి అయ్యపురెడ్డి గారును, ప్రముఖ భూస్వామి అల్లూరు ఆరెకట్ల మల్లారెడ్డిగారును. అపుడపుడు నరసింహారెడ్డి చరిత్ర కావ్యముగ వ్రాయుమని నన్ను కోరుచుండిరి. ఇదియిట్లుండగా ప్రకృతము బెంగుళూరు విశ్వవిద్యాలయమున ఆంధ్ర శాఖాధ్యక్షులుగానున్న శ్రీయుత డాక్టర్ తంగిరాల వెంకటసుబ్బారావుగారు తిరుపతిలో విద్యార్థిగా నున్నపుడు Ph.D. పట్టముకొరకు విశ్వవిద్యాలయమువారికి సమర్పించిన వీరగాథలు అను పరిశోధనా వ్యాస సంపుటియందు నరసింహారెడ్డి గాథను విశేషముగా శ్రమించి ప్రామాణికాధారములతో బహిర్గతముచేసిరి, వారికి నేను, పాఠకలోకము మీదు మిక్కిలి

ఆంధ్రులందరును కృతజ్ఞత చూపవలసియున్నది. వీరుకూడ నరసింహారెడ్డి చరిత్ర పద్యకావ్యముగా వ్రాయుమని లేఖామూలమున నన్ను కోరియుండిరి.

ఈచరిత్ర బహిఃప్రపంచమునకు తెలియుటవల్ల శ్రీఅయ్యపురెడ్డిగారు పౌనఃపున్యముగా కోరుచుండుడవల్లను, ఇతఃపూర్వము నేను రచించిన "వీరకంకణ కావ్యము" లబ్దప్రతిష్ఠులగు పండితుల, పెక్కు పత్రికల, పాఠకుల ఆమోదమును పొందుటచే కల్గిన కొంత ఆత్మ ప్రత్యయమువల్లను, రచనకుపక్రమించి ద్వితీయ ఘట్టము వరకు రచించితిని. శ్రీ వెంకటసుబ్బారావుగారి వ్యాసము వలన నరసింహారెడ్డి ఆంగ్లేయులతో మూడు సంవత్సరములు పోరాడుచు నల్లమల, ఎఱ్ఱమల దుర్గమారణ్యములలో పెక్కుయుద్ధములు చేసినట్లును, ఆ స్వాతంత్ర్య సమరములలో ఒకప్పుడు కంబం తహశీల్దారుని, ఎందరో ఆంగ్లసైనికులను వధించుటయేగాక ఆంగ్లసేనాని లెఫ్టనెంట్ వాట్సన్‌కు భీతావహుండై యుండియున్నట్లును, ఇప్పటికిని నల్లమల దుర్గమారణ్యములలో క్రొత్తకోట అనుచోట శిధిలమైన ఒక దుర్గమున నరసింహారెడ్డి యుపయోగించిన ఒక ఫిరంగియున్నట్లును తెలియుచున్నది. అయినను ఆ యుద్ధముల వివరములు సమ

గ్రములుగ తెలియనందున వానిని పరిశోధించి విషయసేకరణా నంతరము కావ్యమును పూర్తిచేయవలెనను నుద్దేశముతో అంతవరకు మాత్రమే రచించితిని. కాని, రూపనగుడి, ఇంజేడు, పెద్దయమ్మనూరు, కాకరవాడ, ఉప్పలూరు, నొసం, అల్లూరు, గుళ్లదుర్తి, హరివరం, ఎగ్గోను, ముక్కమళ్ళ, ఆల్వకొండ, గంగాదేవిపల్లె, కొత్తపల్లె, గ్రామములలో నివసించుచున్న, నరసింహారెడ్డి శాఖీయులు, కాలవిలంబనమును సహించక తొంద రించినందున, రచించిన రెండు ఘట్టములను, ప్రకటించుకొనుటకు సమ్మతించి వారికిచ్చితిని. భగవదనుగ్రహమున అవశిష్టభాగమును త్వరలో పాఠక లోకము కరకమలములకు సమర్పింతును. ఇందలి ప్రతివిషయమునకు శ్రీ వెంకటసుబ్బారావుగారి వ్యాసము ప్రమాణము. ఈ పుస్తకము నిట్లు నిర్దుష్టముగా సర్వాంగసుందర ముగా ముద్రించుటకు కృషిచేసిన కడప శారదానిలయమునందు తెలుగు పండితులుగానున్న విద్వాన్, బ్రహ్మశ్రీ వెల్లాల సుబ్బయ్య గారి యాదరము మరువరానిది. వారికి నా నమోవాకములు. ఇందేమైన గుణమున్నచో, మీ హృదయమున నాకు కొంత స్థాన మియ్యవలసినదిగా పాఠక మహాశయులకు విన్నపము.

ఉయ్యాలవాడ
1-6-1973.

ఇట్లు,
గ్రంథకర్త.

"శ్రీరస్తు"

గీ॥ శ్రీలు విలసిల్లు రాయలసీమయందు
రెడ్డికులజులు - మహిత నిర్ణిద్రమతులు
బాహుశక్తి, ప్రజారక్తి పరిఢవిల్ల,
నేలుచుండిరి పూర్వంబు పాళెములను॥

గీ॥ వీరికులమున పెంపొందు పెక్కుశాఖ
లందు, మోటాటిశాఖయం దవతరించి
నట్టి, వీరాధివీరుఁ "ఉయ్యాలవాడ"
నగరనిలయుండు మనకథానాయకుండు॥

మ॥ అమితోద్దండదురంత పీడనకులోనై, భారతీయ ప్రజా
సముదాయంబొనరించినట్టి ప్రథమస్వాతంత్ర్య సంగ్రామరం
గముకన్నం బదియేండ్లకున్ మునుపె యాంగ్లప్రాజ్య
సామ్రాజ్య సై
న్యముపై గత్తిని దూసినట్టి "నరసింహారెడ్డి" సామాన్యుఁడే?

## కథా ప్రారంభము.

క॥ ఘనతర చెంచుమలాన్వయుఁ
డనఘుఁడు "జయరామిరెడ్డి" యనునాయకుఁ డు
ర్విని పాలించుచు నుండెను
ననువుగ "నొస" మన్ననగర మాస్థానముగన్॥

చ॥ అరువదియారు గ్రామముల కాతఁడు నాయకుఁడై, ప్రజాహితం
బరయుచు, పేదసాదలకు నాదరువిచ్చుచు, రాజధర్మ సు
స్థిరుఁడయి రాజ్యపాలనము సేయుచు, హాయిగనుండె, నింతలో,
గఱకుబ్రిటీష్ వణిక్కులకుఁగన్నుపడెన్ తదధీనమౌధరన్॥

ఉ॥ భారతభూమిపైనిఁ దమపాదము మోపిన నాఁటినుండి, వ్యా
పారమెగాక రాజ్యసముపార్జన సేయుచు నాఁటికే సువి
స్తారమహీతలమ్మునకు శాసకులైరి బ్రిటీష్వణిక్కు ల
వ్వారల ఢాకకిచ్చటి నృపాలురు డీల్పడియుండిరందఱున్॥

ఉ॥ అత్తఱి వారలాడినది యాఁటయు, పాడినదెల్ల పాట, యే
యెత్తును వేయుచున్నదియే, యొక నీతియు నౌచునుంట, ఆ
జిత్తులమారి వర్తకులు శ్వేతముఖుల్, ఘనసేనతో, నక
స్మాత్తుగ ముట్టడించిరి నొసంబుఁ దుపాకులబారు నెత్తుచున్॥

చ॥ అతఁడు మహాప్రతాపయుతుఁడయ్యును 'శ్రీజయరామిరెడ్డి' యా
గతి తనపైకివచ్చిన యఖండ బలాన్విత శత్రుసైనిక
ప్రతతినెదుర్కొనం దగిన రాణువ దగ్గరలేక యుంట, నం
చితమతిశాలియౌటఁబరిశీలన జేసెను తత్పరిస్థితిన్॥

ఉ॥ నాకడ నిప్పుడున్న పృతనాబలమల్పము, దీనితో, నసం
ఖ్యాకములౌ బ్రిటీషు బలగంబులఁ దాకుట సాధ్య, మెట్టియే
కైక ధనుర్ధరుండయినఁ, గాలము చాలనివాఁడు మొప్పెగాఁ
దాకి జయింప నోపునె? వృథాశ్రమనొందుట రాజనీతియే?

చ॥ అదియునుగాక, సాటివసుధాధిపులంద అపార సైన్యసం
పదవెలుగొందు నాంగ్లపరిపాలక వర్గముతోడఁబోరుగా
నద నిది కాదటంచు, ననువౌగతి సంధి యొనర్చుచుండి, ర
ప్పగురుపోవుమార్గమునుబట్టుట యుక్తముగాఁదలంచుచున్॥

గీ॥ తనదు నేల్బడి తగ్గించుకొనెడునట్లుఁ
దనకుఁ దనవారసులకును తరతరంబు
గా, "తవర్జీ" యనెడు వార్షికంబు భృతిని
వారొసగునట్లు సంధి నేర్పఱచుకొనియె॥

మ॥ అతఁ డాసంధినిబట్టి, సంకుచిత రాజ్యశ్రీకుఁడై, యెంతయున్
మతి చింతించుచునుండె, నంత, ముది సంప్రాప్తింపఁగా పుత్రసం
తతిలేకుండుటఁజేసి, దత్తుగొనియెం దౌహిత్రునిం, ధీరస
మ్మతునిన్, 'మజ్జరి' వంశజాతు 'నరసింహారెడ్డి' యన్బాలకున్॥

మ॥ అతఁడే, యాంగ్లవిభుత్వ సేనలకు సింహస్వప్నమై, తచ్చమూ
పతి 'వాట్సన్'దొరకే యడల్ గొలిపి, కల్పాంతస్ఫురద్భైరవా
కృతి దీపింపరణంబొనర్చి, జనముల్ ''రేనాటివీరుం''డనం
దతవిఖ్యాతినికొన్న ధీరుఁ, డభిమానస్వాంతుఁ, డత్యంతమున్॥

గీ॥ ప్రజలు ''కుందేర'' టంచును పలుకుచున్న
పావనకుముద్వతీనది, పారునేల
నల్లరేగడియాట ''రేనాటి'' సీమ
యనెడునట్టిదె, మనరెడ్డి జననభూమి॥

గీ॥ మనకథారంగ మద్దాని మధ్యమందుఁ
గ్రాలుచుండుటచే, ''నడిగడ్డ'' యందు
రచటి ప్రజలంచితాత్మ, లాత్మాభిమాన
పరులు, కష్టించి పనిచేసి బ్రతుకువారు॥

గీ॥ ఆత్మగౌరవమునకు, నావంతయేని
భంగపాటొనరించిన వానిఁబట్టి
పంతమున మట్టుబెట్టెడు నంతవరకు
పట్టుబట్టుట, వారిస్వభావగుణము॥

గీ॥ అట్టివారికి నాయకుఁడైన కతన
వారిగుణములు రెడ్డికి పట్టుబడుచు
రక్తగత, మాభిజాత్యమౌ, రాజసమును
బెంచి, యాతని, వీరాధివీరుఁజేసె॥

క॥ కుందునదికి పడమటితట
మందుంగల "రూపనగుడి" యందుం, జననం
బొందెను తూరుపుతీరం
బందలి "ఉయ్యాలవాడ" యందు వసించెన్॥

గీ॥ అరయ, నీరెండు గ్రామాల కనతిదూర
మందుగల "గుళ్ళదుర్తి" యటన్న గ్రామ
మందు, బాల్యంబు గడిచి ప్రాయంబువచ్చు
వరకు, నల్లారుముద్దుగా పెరిగె నతఁడు॥

గీ॥ శైశవంబాది తగిన శిక్షణము నొంది
తనకు నుచితములైన విద్యలను నేర్చి
మొలకమీసంబు మొగముపై పొటకరించు
నాఁటికే పెక్కుకళల నిష్ణాతుఁడయ్యె॥

గీ॥ పుక్కిటను బట్టి యూదిన మొరముురాళ్ల
చెట్టుకొమ్మలపైనున్న పిట్టలకును
దవిలి కూలంగఁజేయు నంతటి శరీర
బలము నార్జించె, వ్యాయామకలనచేత॥

సీ॥ కలికి తురాయి గీల్కొలువు పట్టురుమాలు
గట్టిన యుత్తమాంగంబుతోడ
వైష్ణవభక్తిభావము చాటు నూర్ధ్వపుం
డ్రము నీటుగొలుపు ఫాలంబుతోడఁ
గ్రేవలఁ గెంజాయరేకలింపారు నా
తతదీర్ఘ ధవళనేత్రములతోడఁ
జిఱునిమ్మకాయల నిరువైపునిల్పుకో
జాలినగుబురు మీసములతోడ

గీ॥ వైరిహంవీరవిదళన ప్రళయకాల
దండనిభఖడ్గకలిత హస్తంబుతోడ
ప్రజకు భయభక్తి సంభ్రమభావములను
గొలుపు వర్చస్సుతోడ నబ్బలియుఁడలరు॥

గీ॥ ఎంత యుద్దండుడో(యంత శాంతమూర్తి
యెంతటి శరుండో యంతటిమృదుల హృదయుఁ
డెంత నిష్కృష్టభావుఁడో యంతవిశద
వర్తనుండు పరిస్థితి బట్టిఁ యతఁడు॥

గీ॥ వైరమొదవిన యప్పు డెవ్వానికైన
ఫాలనేత్రంబు విప్పిన శూలపాణి
తన్నుఁజేరిన విహితబృందములకెల్ల
సవిధముననున్న కల్పవృక్షంబతండు॥

క॥ తనదర్శనంబుఁ గోరుచుఁ
జనుదెంచిన బుధులతోడ సత్కవితాగో
ష్ఠిని జరుపుచుండు నాతం
డనయంబును సాహితీప్రియత్వము మెరయన్॥

ఉ॥ అగ్రకులోద్భవుండు మహితాత్ముఁడు వేంకటసుబ్బయాఖ్యధీ
రాగ్రణి క్రిష్టిపాడనెడు నంతికగ్రామనివాసి నిగ్రహా
నుగ్రహశక్తివంతుఁడు హనూమదుపాసకుఁడప్పుడప్పు, వి
ద్యాగ్రహయాఖరెడ్డి సభయందొనరించు కళాప్రసంగముల్॥

గీ॥ తనకు సాహిత్యగురువు, విద్వద్వరుండు
సంస్కృతాంధ్ర కవిత్వ విశారదుండు
''ఓబుళాచార్య''లను వైష్ణవోత్తముండు
దనరుచుండెను నతని యాస్థానమందు॥

క॥ కరవాలు నడుము డాపల,
ధరియించి, తురంగమెక్కి, తత్ప్రాంతములం
జరియించుచు బాగోగులఁ
బరికించుచు, ప్రజలకాత్మబాంధవుఁడయ్యెన్॥

మ॥ అవకాశంబులఁగొంచుఁ బ్రాంతముల స్వాహా సేయుటేగాక, యి
య్యవనీరాజ్యధనాధికారముల నాయారీతులం బిండుచు
న్న విదేశీయులపైని ద్వేషము మదిన్నానాఁటికింగాఢమై
యవశుం జేయుచునుండె, నంతట విపర్యాసంబొకండేర్పడెన్॥

మ॥ తనకేటేట ప్రభుత్వమిచ్చు భరణద్రవ్యార్థ మాసాలునం
దనయుం 'కోవెలకుంట్లకంప తహసిల్‌దారుండు' తత్పూర్వమే
తనకున్ రెడ్డికి నొక్కచోట నొక సందర్భంబునన్ సంభవిం
చిన వాగ్వాదము జ్ఞప్తినుంచుకొని దూషించెన్ మదోన్మత్తుఁడై॥

ఉ॥ దాసరిక్రింద కూడ, నొకదాసరియా, యని యీసడించి, యా
దాసరి వచ్చి మమ్మడిగి ద్రవ్యముఁ గైకొనవచ్చుటన్న, న
చ్చో సమయజ్ఞుఁడౌచు దొరసుబ్బయ రోసమడంచుకొంచు వి
చ్చేసి యతండు తండ్రికిని జెప్పగ రెడ్డి మహాగ్రహోగ్రుఁడై॥

మ॥ అవురా! వా డధికారదుర్మదముతో నట్లాడెనా? లేక మృ
త్యువు వానిం గబళింపఁబూని ముఖమందున్నిల్చి యాడించెనా?
యెవ రేన న్నది వానికిం దెలియదా? యెంతేని దుర్గర్వధూ
ర్త్యవశస్వాంతునిఁ గాలవంచితుని రేపే చీల్చి చెండాడెదన్॥

గీ॥ వాని రక్తంబు నీకరవాలమునకు
భుక్తినొసఁగక నేనిక భోజనంబు
ముట్టఁబోనని పంతంబుఁబట్టి యతఁడు
దాని పరిణామము నెల్లఁ దలఁచె నిట్లు॥

ఉ॥ ఏ నొనరించఁబోవుపని, యిప్పటికిం సుకరంబె, కాని యా
పైన, ప్రభుత్వమే కదలివచ్చు ననుంజెరపట్ట సైన్యసం
తానముతోడ, నప్పు డది నాకు భరంబగు, నొనుగాక నే
మైనను, వాని నిప్పుడు, యమాలయమంపక యోర్వవచ్చు నే?

ఉ॥ అంతయెగాక నాదు హృదయంబున నిండిన దేశమాతృకో
పాంతసపర్యలం బ్రథమ మాంగ్లవిభుత్వమడంచు, టయ్యద
త్యంతము దుర్ఘటంబయిన దైనను సర్వమునొడ్డి చేతనై
నంతయొనర్చుచుం బ్రజలయందొక సంచలనంబుఁ
గొల్పెదన్॥

చ॥ పరపరిపాలకుల్ గొలుపుబాధలు భారతభూమిపైని దు
ర్భరమగుటం బ్రజల్ దిరుగుఁబాటున కున్ముఖులౌచునుండి రీ
తరుణమునం దెవండయిన ధైర్యమునన్ మునుదూకెనేనిఁద
త్సరణి కృతార్థ మాప్రథమచర్యకు, నాయది నాందియై
తగున్॥

గీ॥ అనుచుఁ దలపోసి తత్క్రియాయత్తుఁడగుచు
నచటికిని మూఁడుపరుపులయందునున్న
"కలవటాల"కు వార్తను తెలియఁజేయ
రెండువందల బోయలదండు వచ్చె॥

గీ॥ చెప్పి చేసెడి పౌరుషశీలి గానఁ
దనప్రయత్నంబుఁ దహసీలుదారునకును
దెలుపుటకుగాను నొక్కనిఁ బిలిచి చెప్పెఁ
దనదుమాటలుగా నిట్టులనుమటంచు॥

గీ॥ నీవు పలికినరీతిగా నిజముగాను
దాసరినిసుమ్ము నరసింహదైవమునకు,
నీకుమాత్రము కాలసన్నిభుఁడసుమ్ము,
తెలిసికొను మింత రేప యేతెంతు నేను॥

చ॥ గడచినకాలమందు నొక గౌరవపద్ధతి నిచ్చుచుంట, నే
నడుగుచునుంట స్వత్వధనమైనను, నేనిక నన్యునెవ్వనే
నడుగను, కోశమందిరమునందుఁ జొరంబడి కొందు, నడ్డమై
దొడరిన వారినందఱినిఁ దుంటలు తుంటలుగాగఁ గూల్చుచున్॥

గీ॥ స్వపరపరిమాణమెంచక పలుకునీకు
దాని ఫలితంబు నిప్పుడందంగఁ జేతుఁ
గాచుకొనుమంచుఁ గోపంబు నాఁచిపట్టి
దూత నా తహసీల్దారుఁ దొరయఁబంపె॥

క॥ మఱునా డుదయంబుననే
పరివారము హెచ్చరించి పయనంబగుచున్
నరసింహదైవతంబును
స్మరియించుచు వెడలె, సర్వసాధనయుతుఁడై॥

గీ॥ "ఒడ్డె ఓబన్న" యనునతం డుఱుబలాఢ్యుఁ
డంగరక్షకుఁడై, తనహయము ముందు
జనగఁ "గోవెలకుంట్ల" పత్తనము త్రోవ
దండు నడిపించె ఖండనోద్దండుఁడగుచు॥

చ॥ అనిమొననేను నేననుచు నాౘ్రమఁజెందెడువారు వైరులం
దునుముటగాక యింకొకటి తోచనివారలు, బోయవారు పే
ర్చినతమితోడ వెందవిలి రెడ్డి తురంగమువెంట "కోబలీ"
యని పెడబొబ్బవెట్టుచు నుదాయుధులై చనుదెంచి
రందఱున్॥

ఉ॥ కోవెలకుంట్ల పట్టణముఁ గొల్లకొనం జనుదెంచుచుండె సై
న్యావళితోడ రెడ్డియని, యచ్చటనొక్క పుకారుపుట్ట భీ
త్యావిలులై యొకొక్కఁడును నచ్చటనచ్చట గుంపుగూడి, రాఁ
బోవు విపత్తుదాటు ననువుల్ పరిశీలనఁజేయుచుండఁగన్॥

క॥ సమరసముద్భట భటతం
డముకేకలు, మురహపటహఢక్కాఘనరా
వములొరసి బోరుకొల్పఁగఁ
గ్రమముగ నాతండు, పురముకడ కరుదెంచెన్॥

సీ॥ అనువైనచోట భూమినిఁద్రవ్వి తమకున్న
ధనమునంతయు దాచుకొనెడువారు
నీయుపద్రవమునందెట్లేనిఁ గాపాడు
మనివేల్పులకు మ్రొక్కుకొనెడువారుఁ
దమకెల్ల శనిరీతి దాపురించెను తహ
సిల్దారుఁడనుచు దూషించువారుఁ
దమశీలములకు నేతరుగు చేకూరునో
యని సాధ్వులం గొందరడలువారు

గీ॥ నగుచు నప్పురి వారెల్లఁ బ్రాణభయము
నిట్టలంబయి పర్వెత్తి, చెట్టుకొకఁడు
గుట్టకొక్కఁడుగా, దాగుకొనిరి, కొంద
ఱిండ్లలో దూరుకొనిరి వాకిండ్లుమూసి॥

గీ॥ నగరమును జొచ్చి, యది, నిర్జనంబులగుట
బావురుమనెడు వీధులఁబట్టి నడిచి
యంచితముగ ప్రభుత్వ కార్యాలయములు
వరలుచోటికి నటు సరాసరిగ వెడలె॥

చ॥ తనకడ నప్పుడున్న భటితండమె రెడ్డిని నాపనోపునం
చనుకొని యాత్మరక్షణకునై, యతఁడెచ్చటికేనిఁ బోకయుం
డెను తహసీలుదారచటనే, మఱికాలము దాపురించినన్
మనుటకు యుక్తమై బరగు మార్గముతోచునె? యేరికేనియున్॥

చ॥ అలఘుబలంబుతోడ నతడఁచ్చటికిం జనుదెంచుచుండ భీ
తిలి, తమయాయుధంబులను దిగున నేలకువైచి యందఱుం
దలకొాకతోఁవఁ బర్వులిడి దాగిరి కావలివారు-కూలికై
కొలిచెడివారికిట్టి యనుకూలము లెవ్వడు నేర్పగావలెన్॥

గీ॥ తనదు రక్షకులగువారు, తామె, రక్ష
ణార్థమై పర్వటరసి, పెల్లదవదించి
ప్రాణమురియాడ నతఁడొక్క భవనమందుఁ
దలుపులను మూసికొని లోన దాగుకొనియె॥

చ॥ అచటికిఁబోయిచూడ నొకఁడైనను గన్పడఁడయ్యె రెడ్డి కం
దచటచటం దుపాకు లితరాయుధముల్ బడియుంట, వానిగా
చుచుఁ దనరాకదండడినిఁజూచి ప్రభుత్వదళంబు, భీతినొం
దుచుఁబరువెత్తి యున్నటులఁదోచెడి వీనినిబట్టి చూచినన్॥

చ॥ అనితలపోసి కార్యకలనాతురుఁడై, నలువైపులందుఁగా
పునిలిచి పట్నమంతయును ముట్టుచు, నయ్యధికార దుర్మదాం
ధునిఁ దహసీలుదారునిఁ గనుంగొనితెచ్చుటకై, హుటా
హుటిం
బనిచెను రెడ్డి, స్వీయభటబృందము నీగతిహెచ్చరించుచున్॥

ఉ॥ మీరెవరైనఁగాని మితిమీరి చరించుచు స్త్రీలపై దురా
చారమొనర్పరా దెవరిస్వత్వము పూరియుఁగూడ ముట్టరా
దేరికి నూరకే భయమొకింతయుఁగొల్పగ రాదటం చసా
ధారణధీరవర్తనుఁ డతండు వచించుచుఁ బంపినంతటన్॥

సీ॥ ప్రతి గృహంబునుజొచ్చి ప్రశ్నించి మూలమూ
లలనున్న గాదెగంపలను వెదకి
బిచ్చగాండ్రున్న చావిళ్ళ సత్రింబులు
పరికించి వారినందఱి సడించి
పాడుపడినవివోలెఁ బ్రతిదేవతాయత
నముఁజొచ్చి యవలోకనమ్మొనర్చి
గుబురుగాఁబెరిగి దాగుటకు వీలైనట్టి
చెట్టుచెట్టునుఁబరీక్షించి చూచి

గీ॥ నగరమంతయు నన్నిప్రాంతముల వెదకి
యెందుఁగానక విసువును జెందఁబోక
వారు, పలుమారు తహసీలుదారు కొఱకు
చూచుచుండిరి చూచినచోట్లనెల్ల॥

గీ॥ అచట రెడ్డియుఁ దత్క్రియావ్యగ్రుఁడగుచు
"ఒడ్డె ఓబన్న" యను మఱియొక్కభృత్యుఁ
డనుసరింప ప్రభుత్వ కార్యాలయముల
వెలుపలను లోనఁదిరుగుచు వెదకఁజొచ్చె॥

గీ॥ ఒక యగారముఁజేరి మూసికొనియున్న
తలుపులన్ని యొకొక్కటే తట్టిత్రోయఁ
తెఱచుకొనుచుండుటరసి, యిందే యతండు
దాగుకొనియుండుననుచు నాత్మందలంచి॥

గీ॥ ఓయి! యిచ్చోటనే దాగియున్నవాఁడ
వే! నినుంజూడ నిందాక వెదకుచుంటి
నే! నినుంబోలువారలే యిట్టులున్న
ప్రభుత యెటుసాగు నాంగ్లేయ పాలకులకు?

మ॥ తపదుష్పాలన క్రింద హైందవుల మ్రందంజేయు నాంగ్ల
ప్రభు
త్వము పాదంబులఁబట్టి వారికిని సేవల్ సేయుటే గొప్ప భా
గ్యముగా నెంచుచు విఱ్ఱవీగెడు దురాత్మా! నిన్న నీ వన్నవా
క్యము లన్నింటికి నుత్తరంబొసగు మత్ఖడ్గంబు ర మ్మీవలన్॥

ఉ॥ ద్వారకవాట మీక్షణమె బ్రద్దలుచేసి నినున్ యమాలయ
ద్వారముఁజేర్తు నాదుకరవాలము నిచ్చెనగా నొనర్చి. యీ
భారతభూమిపైని నిలువందగ వింతయు, వచ్చుజన్మలో
వారికిఁ బుట్టి యెల్లపుడు వారిపదంబులు గొల్చుచుండుమీ॥

మ॥ అని గర్జించుచు రోషరుదహృదయుండై ముష్టిపైకెత్తి హు
మ్మనుచుం గ్రుద్దిన ఘాతకుం దునియలై యవ్వాకిళుల్ నేలఁగూ
ల, నగారంబును జొచ్చి యాతఁడొక మూలన్నక్కియున్నట్టిశ
త్రునిపై దూకెను లేడిఁగన్గొనిన శార్దూలంబు చందంబునన్॥

చ॥ కఱకఱపండ్లునూరి చెడుగా! యిటురమ్మని పట్టి యీడ్చి ని
ర్భరమగు నక్కసమ్ముమెయి, వానిశిరమ్మును గాలదన్నుచుం
గఱకు కటారుఁగేలఁగొని గ్రక్కునవైవ శిరంబు
మొండెముం
ధరణి పయింబడెన్ రుధిరధారలు మందిరమెల్లఁ జిమ్ముచున్॥

గీ॥ అంతఁ గోశగృహమ్ము౯న కరిగిచూడ
నింత జరుగుచునున్న నావంతయేనిఁ
బెంపుచెదరని ధీరగంభీరము్ద్ర
వదనమున వెల్గువాఁడు కన్పడె నొకండు॥

గీ॥ అతఁడు బొందిలి "నారసిం" గనెడు క్షత్రి
యుఁడు-ఖజానాకుఁ గావలియుండినాఁడు
ఘనకృపాణము నడుము ప్రక్కను ధరించి
పాణితలమున నొక్క-తుపాకిఁబూని॥

గీ॥ ఆత్మకర్తవ్యమునకునై, ప్రాణమైన
విడుచుటకుఁగూడ, సంశయపడని వాని
వార్ధకముఁజూచి, రెడ్డి సంభ్రమమునొంది
యతని కీర్తిఁ బల్కె- నాప్యాయనముగ॥

శా॥ అన్నా! యెవ్వఁడవో యెఱుంగ-మజీనీయాకారమున్ వర్తనం
బు నీన్ని వుత్తమ వీరవంశమున సంభూతుండవైయుందు వం
చు న్నాబుద్ధికిఁ దోపఁజేసెడివి, ఓశూరాగ్రణీ! నిక్క-మా
నిన్నుంబోలినవానిఁజూడ మదినెంతే నాకు నానందమౌ॥

ఉ॥ కావున నేనోర్వగల కార్యముఁ దెల్పి హితంబు పల్కెదున్
నీవు గ్రహించి మేల్గనుము! నేనిపుడెంతయు, నీ ప్రభుత్వ భాం
డావసథంబు కొల్లఁగొన నాయితమైతిఁ గటారుకేలుతోఁ
గావునఁ బ్రక్కకుందొలఁగి కాంచుచునుండుమ యూర
కంతయున్॥

ఉ॥ కాదని మమ్ము నడ్డుకొనఁగల్గుదువా, యొకరుండవీవు నీ
వే, దలపోయు మింత, నవివేకముగాఁ జరియింపఁబోకు, మో
యాదరణీయ!_తప్పుకొనునట్టి యుపాయము గల్గినప్పుడి
మ్మేదినినెవ్వరేనిఁ దమమీఁది కపాయముఁ దెచ్చుకొందురే?

గీ॥ ప్రాణరక్షణ ముఖ్యకర్తవ్య మనుచుఁ
దలఁచి నీతోడి వారలందఱును గూడఁ
దప్పుకొన్నారుగాదె? యీ ముప్పునుండి;
వారిమార్గము నీకనుభావ్య మిపుడు॥

క॥ అందఱికి లేకపోయిన
తొందర, నీకొకని కేల దొడరుచు నసువుల్
ముందొడ్డి నిల్వగా! ధన
మందిర మిది నీకు పిత్ర్యమా? స్వార్జితమా?

చ॥ మఱియొకరీతిఁజూడు, మాతృధరిత్రినిఁ దోఁచుచున్న ము
ష్కరులు బ్రిటీషువారి ధనసంచయముం బరిరక్షసేయు పె
వ్వరయిన మెత్తురే?-ప్రజలు బాగనఁబోని ప్రయత్నమందు ని
ష్ఠురముగ బ్రాణముల్ విడువఁజూచుటకన్నను
వెఱ్ఱియున్నదే?॥

గీ॥ ఉదరపోషణకందువా! యుర్వియందు
బ్రతుకఁదలఁచిన నెన్నిమార్గములు లేవు?
వెదకుకొననేల, నా భటబృందమందుఁ
జేరుకొనుమోయి! నేన పోషించుచుందు॥

ఉ॥ ఏను బ్రిటీష్ ప్రభుత్వము పయిం ధ్వజమెత్తితి, దానిఁ
గూల్పఁ జేఁ
బూనిన ఖడ్గమున్నదురఁబుచ్చను, నాకును దోడువచ్చు నె
వ్వానికినైన స్వాగతముఁబల్కెదఁ గూల్చెద నడ్డమైన యె
వ్వానినిఁ గాని, నాకితరపద్ధతి యేదియులేదు నెమ్మదిన్॥

ఉ॥ వారు తలంప నీకుఁ గులబంధువులా? వెనుకాడనేల, ఓ
వీరుఁడ! రమ్ము నా యడుగువెంబడి శస్త్రముఁజేతఁ
బూనుచుం
భారతభూమిపైని పరపాలనముం బెకలించు పూన్కితోఁ
బోరెడుపట్లఁ బ్రాణములు వోయిన శాశ్వతకీర్తి దక్కెడున్॥

మ॥ అను నారెడ్డికి నారసింగు వినతుండై పల్కెనీరీతిగాఁ
ననఘా! త్వాదృశులైన యార్యులు మదీయశ్రేయముంగోరి ప
ల్కిన వాక్యంబులలోని ధర్మమును దర్కింపంగ నాబోటి య
ల్పునకుంగూడదుకాని, నాదుహృదయంబున్ విప్పి
చూపించెదన్॥

గీ॥ దేశహితమెంచి తత్పరిస్థితికిఁదగిన
క్రమము నారసి కార్యతంత్రమ్ము నడుపు
ప్రభువులకు యుక్తమైనమార్గమ్మె మాకు
భృత్యులకుఁగూడ నర్హమౌనే? మహాత్మ!

గీ॥ జీతమునుగొని బోషకుల్ సెప్పినట్టి
పని నొకింతయు శక్తివంచనము లేక
చేయుచుండుట యొక్కటే, సేవకునకు
పరమధర్మంబుగా నేను పరిగణింతు॥

గీ॥ జన్మభూమికి దాస్యమోక్షణ మొనర్పఁ
దెంపు చూపించినారు. "బుందేలుఖండ"
దేశవాసులు మావారు, దేశభక్తి
నాదుహృదయాన లేకపోలేదు! కాని॥

గీ॥ ఇంతకాలమునుండి యేతృణమొ పణమొ
వారినుండి గ్రహించి జీవనమొనర్చి
సమయ మేతెంచి నప్పుడీ సాకుతోడ
జాఱుకొనుటను మెత్తురేఁ ధీరవరులు॥

గీ॥ స్వపరదేశీయ భేదభావమును గొలుపఁ
జేరుటకుఁ బూర్వమందైనఁ జేయవచ్చు,
చేరి యీరీతి విచికిత్స సేయనగునె?
స్వవిధి పాలించవలసిన సమయమందు॥

గీ॥ ప్రాణభయమునఁ గర్తవ్యపాలనంబు
నుండి తొలఁగుట-మామకానూనకీర్తి
సారబుందేలుఖండ సుక్షత్రియాన్వ
వాయు లెఱుగని క్రొంగ్రొత్త పాఠమయ్య॥

చ॥ అనివచియించు భవ్యమతి యాతని నిర్మల ధర్మవీరతా
వినయవివేక రీతులకు విస్మయమొందుచు, రెడ్డివర్యుఁడి
ట్లనుకొనె నిష్టనిష్టముగనైనను, నుద్ధతిఁజూపకున్నచోఁ
బని నెరవేరఁబోదనుచు వాని తుపాకినిఁ బట్టి లాగినన్॥

గీ॥ అతఁడు తాడిత పన్నగంబట్లురేఁగి
యడిదమునుదూసి పైకెత్తునంతలోన
నాలసించిన నింక నపాయ మనుచు
నొడ్డెయోబన్న వానిని నుత్తరించె॥

గీ॥ క్షణములో నియ్యదంతయు జరిగిపోయె,
నవనిఁగూలిన యుత్తమప్రాణి "నార
సింగు" నరయుచుఁ గన్నులు చెమ్మగిల్ల
రెడ్డి పరితాపవిహ్వల హృదయుఁడగుచు॥

గీ॥ ఒక్కక్షణ మట్లె నిల్చి నిట్టూర్పు విడిచి
యంగరక్షకుఁడైన యోబన్న కనియె
నీదువర్తన దుడుకనరాదు, కాని
యింతసుజనుని మృతికిఁ జింతింతుననుచు॥

క॥ అంతట భాండాగారా
భ్యంతరమును జొచ్చి రెడ్డి యందలి ద్రవ్యం
బంతయును కొల్లగొని
పంతంబును బూర్తిచేసెఁ బలికినరీతిన్॥

గీ॥ వైరియైనట్టి తహశీలుదారు శిరము
బల్లెమునఁ గ్రుచ్చి పైకెత్తి పట్టి నడచు
నటుల నొకని నియోగించి భటులతోడ
పట్టణంబెల్ల నూరేగె ప్రబలుఁడగుచు॥

ఉ॥ ఆ మెయినల్పి తృప్తహృదయంబున నచ్చటి "రంగనాయక" స్వామినిఁ గొల్చి, తీర్థము ప్రసాదముఁ గైకొని, కాన్కలం భట స్తోమముఁ దన్పి, పేదలకుఁ దోరపుదానములిచ్చి, యంత, స్వ గ్రామముఁ జేరె నాపయిన రాఁగలకార్యములం దలంచుచున్॥

---

## ద్వితీయ ఘట్టము:

గీ॥ నా(డు కోవెలకుంట్ల ప్రాంతంబులెల్ల(
గలిసియుండెను "కడప" మండలమునందు(,
గాన, నటనున్న, పైయధికారులకును
నెఱుకచేసిరి యీవార్త నిచటివారు॥

మ॥ అమితాటోపముతోడ( బట్టపగలే, యారీతి, నిర్భీకతం
దమయుద్యోగిని( జంపి, యాపయి ఖజానా(దో(చియున్నట్టి దు
ర్దము(డౌ వానిని( గూల్పకున్న( దమసామ్రాజ్యంబుపై విప్లవో
ద్యమముల్ పైకొనునంచు( దల్లడిలి రయ్యాంగ్లేయు లీవార్తకున్॥

చ॥ తనయధికార ముద్ర కల తావుననే యిటులౌట( "కాకరే"
ననియెడు మండలాధిపతి, యాగ్రహపూరిత చిత్తు(డౌచు, వెం
టనె యటనున్న రక్షకభట ప్రకరంబున కాజ్ఞసేయుచు(
బనిచెను రెడ్డి వీరు( జెరపట్టుట కుయ్యలవాడ కేపునన్॥

ఉ॥ వారధికారి యాజ్ఞపయి వచ్చిరి సాయుధులౌచు(; గాని, య
వ్వీరుని విక్రమంబు మును పే వినియుండుట( దత్సమీపముం
జేరెడు గుండె లేకడల( జెందుచు( గార్యకలాప మూఢులై
యూరికి వెల్పలం విడిసియుండిరి ప్రాణము( జిక్కఁబట్టుచున్॥

గీ॥ వీరి యీ తీరునెల్ల నవీర్వరవర్యుఁ
డరసి, తనుజేరఁ జడిసియున్నటు గ్రహించె
నదియుగాకప్పు డేతెంచినట్టి వారు
భరతదేశీయులౌట నిక్కరణిఁ దలచె॥

ఉ॥ జీతముకోస మాయుధము చేతధరించిన వారలం భయో
పేతుల యుద్ధభూమి బలివెట్టు టయుక్తమ, కాన, వీరినే
రీతిగనైన వట్టిబెదరింపులతోఁ బరువెత్తఁజేసి, యా
శ్వేతముఖుల్ సమీపమును జెందిన నాబల మప్డుచూపెదన్॥

క॥ అని తలఁచి, నగరువెల్వడి
యనుచర వర్గంబుతోడ సాయుధుఁడగుచుం
జను దెంచి, రక్షకభటులఁ
గని, ప్రావృట్కాలమేఘ గర్జార్భటిగన్॥

గీ॥ పెద్దపులినైన విడిచేత బిట్టడంచి
కోరలను బీకఁజాలిన వీరవరుల
కాకరంబగు నిచ్చోట కలవిగాని
పనిని సాధింపఁ దలపోసి వచ్చినారా?

ఉ॥ ఈ నడిగడ్డపైకిఁ బగయెత్తుచు నెవ్వఁడు గాని వచ్చి కా
లూనగరాదటం చెఱుఁగరో? మఱి మీరలెఱుంగకున్నచో
నేనెఱిఁగింతు నొక్కత్రుటి నిల్వఁడటంచును హుంకరించి, పం
చాననమట్లు దూకుచు రయంబున వారిని డాయఁబోయినన్॥

మ॥ అడుగో! వచ్చుచునున్నవాఁడు, నరసింహారెడ్డి, కల్పాంత కృ
న్మృడభీమార్భటితో, నటంచును భయంబేపార నల్దిక్కులం
బడి పర్వెత్తగఁజూచి, బోయలు, రణవ్యాపారు లవ్వారి వెం
బడి పర్వెత్తుచుఁ బట్టి రెడ్డికడ నిల్వంబెట్ట, వారందరున్॥

చ॥ హృదయమునిండి పెల్లుబికి యెంతయు శోకరసంబు
కన్నులం
బొదలుచు ధారలై కురియఁ బొంపిరి వోయెడు ప్రాణభీతితోఁ
బదములు పట్టివేడగఁ గృపామతియయ్యును, రాజనీతికో
విదుఁడగు రెడ్డి వారికొక బెత్తుతిరంబుగ నుండునట్లుగన్॥

గీ॥ మొదటి తప్పౌట మిమ్ము నిప్పుడు క్షమింతు,
నెన్నడేఁగాని యిటువత్తురేని నికఁ
బ్రాణములు మేన నిల్వఁబోవను యథార్థ
మెఱిఁగి మెలఁగుఁడటంచు, హెచ్చరికఁజేసి॥

క॥ మఱియొకసంగతి; మీ సహ
చరులగు మన భారతీయ జనముల కీ హె
చ్చరిక నెఱిఁగించుఁ, డని యం
దరినాతఁడు విడిచిపెట్టె నయమేపారన్॥

గీ॥ వచ్చునప్పుడు తమవెంటఁ దెచ్చుకొనిన
పెనుదుపాకులు గుడ్డముల్ వివిధవస్తు
చయముఁ గోల్పోయి, రిక్తహస్తముల తోడ
వెడలిపోయిరి యచ్చోటు విడిచిపెట్టి॥

గీ॥ వారు, మృత్యువు వదన గహ్వరమునుండి
బైటపడినట్లు సంబరపడిరి; కాని.
కడప కరుదెంచి తమ యధికారిఁజూడ
నడలఁజొచ్చిరి "యాతఁడేమనునొ" యనుచు॥

ఉ॥ అంతట రెడ్డి సత్తముఁడు దంచితరీతిగఁ గోటజేరి, యొ
క్కింత శ్రమంబుకల్గకయె, యీగతి ముందు తలంచినట్లుగా
నంతయు సానుకూలమయినందులకున్ మదిలోన నెంతయున్
సంతసమంది యాపయిని చక్కటులం దలపోసె నిట్టులన్॥

ఉ॥ ఇంక బ్రిటీషువారు, శివమెత్తినసుం జెఱపట్టి కూల్చ, స
ర్వంకషమౌ ప్రయత్నమున వత్తురు, వచ్చిననాఁడు, మాతృదే
శాంకిత మద్భుజాగతఖరాసికి విశ్రమమీక, దుర్మనః
పంకిల హూణవాహినులపైఁబడి చీల్చక మిన్నకుందునే?

ఉ॥ ఇంతకు నేదియెట్లయిన నిప్డరుదెంచెడు కయ్యమింతలో
సాంతముకాదు, శాత్రవు లనంతచమూ బలవంతులౌట, న
శ్రాంతము మండలాగ్రము కరంబునఁ దాలిచి జీవితాంత ప
ర్యంతముఁ బోరుచుండవలెఁ బ్రాణములాహవ భూమి
నొడ్డుచున్॥

క॥ చిరకాలము జరిగెడు సం
గరమునకుఁ దగినరీతిగా వ్యూహంబున్
నెఱపుకొని సిద్ధపడవలె
నరిసైన్యము లిటకు వచ్చునప్పటి కనుచున్॥

గీ॥ అచటి కోటనుగల కూపమందు జలము
క్షారరుచినొప్పి త్రావయోగ్యంబుగామిఁ
దలఁచి, యాతఁడు యుద్ధ తంత్రజ్ఞుఁడగుట
"నౌసము" దుర్గంబునకు నాత్మవసతిమార్చె॥

మ॥ అతఁడా దుర్గముఁజొచ్చి నల్దెసలఁ గుద్యచ్ఛ్రేణి వీక్షించి, సు
స్థితిగానుండు పెఱింగి, నెమ్మదినిఁ దృప్తింజెంది, యుద్యోగి
సం
తతులంబంపి సమస్తభోజన పదార్థంబుల్ రణప్రక్రియో
చిత నానావిధసాధనంబుల వెసం జేర్పించె నిండారగన్॥

గీ॥ ఏడుపరుపుల దూరమం దెచటనైన
జరుగు సంగతులెల్ల స్పష్టముగఁజూచి
చెప్పఁజాలిన యంజన సిద్ధుఁడొకఁడు
దనరు "గోసాయి వెంకన్న" యనునతండు॥

క॥ జనులు "మహాత్ముఁడ" టంచును
బ్రణుతింపగ మంత్రజపము భగవద్ధ్యానం
బును జేసికొనుచు వర్తిలు
ననయంబును "ఆకుమళ్ల"యను గ్రామమునన్॥

చ॥ అవిరతముం బరార్థమునుపాసనఁ జేసెడు యోగియయ్యుఁ దా
నవసరమైననాఁడు, కరమందుఁ గృపాణముఁదాల్చి భీకరా
హవమున వీరవిక్రమ విహారములన్ వెలయింపఁజాలు యో
ధవరుఁడు, దేశభక్తి సముదార హృదంతరుఁడాతఁ
డెంతయున్॥

గీ॥ తనకు నేకాంతహితుడౌటఁ దనమహోద్య
మమున కాతని యంజన మహిమ, మివుల
యవసరంబౌట రెడ్డీంద్రుఁ డమ్మహాత్ముఁ
బిలిచికొనివచ్చి తనచెంత నిలుపుకొనియె॥

ఉ॥ రాయల యల్లుఁడౌ ''యళియరామ'' మహీపతి వంశసంభవుం
డాయత బుద్ధిశాలి, సముదంచిత నీతివిశారదుండు, నా
త్రేయస గోత్రుఁ ''డౌకు'' నగరీనిలయుండు, నిజాప్తుఁడైన ''నా
రాయణరాజు'' తోడుఁగొన నాతనిచెంతకునేగె నంతటన్॥

క॥ అరుదెంచి, సఖుఁడొనర్చిన
మరియాదలకలరి, సోద్యమక్రమమెల్లం
గరమెఱిఁగింపఁ దొడంగెను
నరసింహారెడ్డి రాజునకు నీరీతిన్॥

శా॥ అన్నా! రోజుకురోజు తీంద్రమగు నయ్యాంగ్లేయ దుష్పాలనం
బెన్నాళ్లంచు సహించుచుందు, మికనిట్లే, చూచుచుం వెయ్యి యేం
డ్లున్నం-దానికదే, యడంగునె? మహోద్యోగంబునం, బోరికిం
సన్నాహంబొనరించి పైఁబడకయున్న, న్నీవె యోజింపుమీ?

మ॥ మనపూర్వుల్ నరపాలు రేలుతఱి సంపద్వంతమై దేశదే
శనుతింగాంచిన భారతోర్వర( బ్రజాసందోహమీనా(డు, పా
యని దైన్యంబున నన్నవస్త్రములకే నల్లాడగా(జొచ్చె, వ
చ్చిన యాహూణ వణిగ్గణంబు ప్రభుతం జేపట్టి పీడించుటన్॥

ఉ॥ తీరని ద్రవ్యకాంక్ష( బలుతీరుల లాభములం గడించు వ్యా
పారులకే ధరిత్రిపయి( బ్రాభవమబ్బిననా(డు, తత్ప్రజా
వారములొందునట్టి దురవస్థలకున్ మఱిపారమున్నదే?
స్ఫారమనీష! నీవెఱుగవా, మది నీబహిరంగ సత్యమున్?

గీ॥ అంతకును మూలహేతువౌ యాంగ్లవిభుత(
గుదురుముట్టుగ( బెకలించి కూల్పకున్న
నినుపగజ్జెల పెద్దమ్మ యీ ధరిత్రి
వదలబోదింక శతశతాబ్దములకైన॥

ఉ॥ అందులకేను సిద్ధపడి యాయుధమూనితి నీవు(గూడ నీ
చందము(గొందువేని, నిక సాగదు హూణవిభుత్వమిచ్చటన్
సందియమేల? గైకొనుము శస్త్రము, నిర్వైర మేకమైన సం
క్రందను(డైన నడ్డుపడ(గల్గునె శాత్రవపక్షమూనుచున్?

చ॥ అదియునుగాక యీ వసుధ యందలి రాజులకుం బ్రజాళికిన్
హృదయములందు హూణుల పయింగడు నక్కసు నిండి
యున్న దీ
యదనున నన్నిప్రాంతముల యందును వారును విప్లవంబు స
ల్పుదు, రపుడీ కిరాతక విభుత్వము కూలదె భారతోర్విపై॥

గీ॥ దైవ వశమున తహసీలుదారు గాథ
కాకతాళీయమై యొప్పెఁగాని, మునుపె
సిద్ధపడియుంటి, నీవిదేశీయ విభుత
పైని, మనప్రాంతమందు విప్లవము రేప॥

గీ॥ వర్తకముఁ జేసికొనుటకై వచ్చియున్న
వారి యదుపాజ్ఞలకుఁ దలవంచికొనుచు
బ్రతుకుటకు మించి యికఁ బరాభవము కలదె
మానుషంబున్న యెవ్వానికైనఁగాని?

గీ॥ ప్రథితపాలక వంశ సంభవులమైన
మనము స్వాతంత్ర్య సమరోద్యమమ్ము నడిపి
దేశదుస్థితి మాన్ప యత్నింపకున్న
మన చరిత్రకు మాయనిమచ్చ నిలుచు॥

ఉ॥ ప్రాకటకీర్తి, యయ్యళియ రామ నృపాల కులప్రసూతివౌ
నీ కెఱిగింపగా వలయునే యిది యింతగ? నేనుమాత్ర మే
కాకిగనైనఁ బోర సమకట్టితిఁ దెంపులులేని తెంపునన్
వీఁక, బ్రిటీషు పాలకుల పీచమడంచుచుఁ బారఁద్రోలఁగన్॥

చ॥ అనితర దేశభక్తియుఁ దదర్చనకై నిటలాక్షునైన డీ
కొన వెనుకంజవేయని యకుంఠిత సాహసదీక్ష పల్కు ప
ల్కున వెలుగొందు రెడ్డిజనకుంజరు వాక్యము లాలకించి, యా
తని సముదీర్ణ వైఖరికిఁ దద్దయు నెమ్మది నబ్బమొందుచున్॥

గీ॥ ఔకు రాజన్యుఁడమిత దేశాభిమాని
వెలిపెఱుంగని సంగ్రామ వీరమౌళి
యయ్యు, సమయ మెఱింగి కార్యక్రమంబుఁ
గొనెడు వాఁడౌట రెడ్డితో ననియె నిట్లు॥

గీ॥ అన్న! మిత్రమ! నీదువాక్యంబులెల్ల
నక్షరాక్షర సత్యంబు, లంతెగాక
పరవిభుత్వ నిరంకుశత్వమున నలుగు
భారతీయులకెల్ల సంభావ్యములును॥

క॥ కౌని, బలవత్ప్రభుత్వము
పైనిం బహిరంగ విప్లవం బొనరింపం
బూనుటకుముందు, స్తిమితము
గా నరయఁగవలయు దేశకాలస్థితులన్॥

గీ॥ ఈ వనినయట్లు దేశమందెల్లరకును
గలదు విద్వేష మాంగ్ల వర్గంబుపైన,
నైన, నిప్పుడె విప్లవోద్యమమునందు
ముందునకు వత్తురనుకొంట సందియంబు॥

ఉ॥ భారతదేశమెల్ల నొక వ్యక్తిగ సంఘటితంబునొంది, పెం
పారెడు పూన్కితోఁ గలిసినప్పుడుగాక, యపార యుద్ధసం
భార పరీతభూరి పరివార విరాజితులైన యాబ్రిటీష్
వారి నడంపనౌనె, తెగువన్ మనమిర్వురమెంత పోరినన్?

గీ॥ దేశ హృదయాంతరస్థ విద్వేషవహ్ని
రవిలి, యేనాటికైనను ప్రజ్వలించు
నపుడు మనమిటసల్పు నుద్యమము గాలి
వీచినట్లయి యంతట విస్తరించు॥

గీ॥ అట్టి సుముహూర్త మేతెంచునంతవరకు
నీవుమాత్రము స్వీయరక్షావిధాన
మనుసరించుట మేలు-కాదని తెగించి
ముందుకుఱికిన మొదటికే మోసమగును॥

చ॥ అరయగఁ గార్యవాది, సమయాసమయమ్ము లెఱింగి యుక్తమౌ
తెఱఁగున సంచరించి, తనధ్యేయము నొందునుకాని, యెన్నఁడేం
ద్వరపడునే? త్వరంపడుచు, వాలునుగైకొని యుద్ధరంగమం
దుఱికినమాత్ర, యత్నము ఫలోదయమౌనె యకాల సంగతిన్॥

గీ॥ నెచ్చెలీ! విభ్రమచ్చక్ర నేమి ధార
చందమునఁగ్రిందు మీఁదౌట సహజమరయఁ
గాన, మెలగుము, స్వీయరక్షణమునందె
నేఁడు కానిది రేపౌట నిశ్చయంబు॥

చ॥ అవసరమైన రీతిగ సహాయమొనర్చుచునుండు నిప్పుడీ
ద్రవిణము స్వీకరించి యుచితమ్మగు యత్నము సంఘటించు కా
మ్యవికలధీరచిత్త! యని, యాతఁడొసంగ గ్రహించి, యంత, మి
త్రవరుని సమ్మతంబుగొని, తానరుదెంచె నొసంబుఁ జేరగన్॥

మ॥ 'తన చందంబునఁ గేల ఖడ్గమును సంధానించి, యాంగ్లేయ పా
లన నిర్మూలన కృన్మహోద్యమము సల్పందోడు వచ్చుం
సఖుం'
డని, తానెంచినయట్లుగాక, ధనసాహాయ్యంబు మాత్రంబు స
ల్పిన రాజన్యుని వర్తనంబున కతృప్తింజెందె, డెందంబునన్॥

క॥ మరలఁ దలపోయఁ దొడఁగెను
నరసింహారెడ్డి వరుఁడు, నయకోవిదశే
ఖరుఁడుఁ దనహితముఁ గోరెడు
బరమాప్తుండౌకు రాజు పద్ధతి నిటులన్॥

గీ॥ లక్ష్యమొకటిగనున్న యెల్లరకుఁగూడఁ
గార్య సంధానమార్గ మొక్కటిగనుండు
టరిది, దాన విభేదమున్నంతమాత్ర
వ్యక్తి శీలంబు శంకించుట నుచితంబు॥

గీ॥ 'ఆప్తవాక్య ముపాదేయ'మని వచింత్రు
విజ్ఞులగువారు, కావునఁ బ్రియసఖుండు
నుడివియున్నట్టి పథము వెంబడిఁ జరించి
పైన యోచనసేతు నప్పటి విధంబు॥

చ॥ అని మది నిశ్చయించుకొని యాతఁడు వైరుల జాడలం గనుం
గొనఁదగువారలంబనిచి, కోటవసించుచు నప్పుడప్పు వెం
కన తన యంజనంబు మహిమాతి శయంబునఁ దెల్పు
చున్న వా
నిని గమనించుచుండె, రణనిష్ఠ నిరంతర జాగరూకుఁడై॥

ఆ॥ వె॥ 'ముక్కమళ్ల' మఱియు 'ముదిగోడు' 'కానాల'
'సంజమల'యు మొదలు జనపదముల
బోయ లతని పక్షమునఁ జేరి పోరాడఁ
దరలివచ్చి రాయుధంబులూని॥

గేయం॥ రాజారావు, రాజబహదురు నారసింహరెడ్డి
రెడ్డికాదు, బంగారపుకడ్డీ నారసింహరెడ్డి
ములుకోలకట్టె చేతులో వుంటే మున్నూటికి మొనగాడు
కరువువచ్చినా కాటకమొచ్చిన ఆదరించె రెడ్డి॥
రెడ్డికోసమూ ప్రాణంపోయిన స్వర్గం వస్తుంది
యీపొద్దిదియా, రేపు తదియరా, నరుని ప్రాణమోయి
నీటిమీదను, బుగ్గవంటిది నరుని శరీరంబు
పదరా, పదరా, తెల్లవారిని తెగనరుకుదాము॥

---

మా ప్రాంతమునఁగల జానపద గేయము, యధాతథముగ
స్వీకరించితిని.

మ॥ అని, యారీతిగఁ బాడుకొంచుఁబటు వీరావేశ మేపారగం
దనపై భక్తిఁ గొలంది గుంపులగుచుం, దామంతకుందామె, వ
చ్చిన వారింగని, హర్షజాతపులకస్ఫీతాంగుఁడై, యందరిం
దన సేనాబలమందుఁ జేర్చుకొనె, నుత్సాహంబునం
బొంగుచున్॥

చ॥ ఇతఁడిటులుండ శ్వేతముఖులింతయు భారతదేశిసైనిక
ప్రతతిని విశ్వసించక, కరంబు, స్వజాతి భటాళితో సమీ
కృతమగు సేన నంపిరి, సమిద్ధపరాక్రముఁడైన రెడ్డివీరుఁ
బం
ధితు నొనరింప, డెందమున నిండినక్రోధము దందడింపగన్॥

క॥ బిరుదగు 'కర్నల్' పదవినిఁ
బరగెడు వాఁడుద్ధతుండు 'వాట్సన్' నాముం
డరుదెంచె, నాంగ్లసేనా
పరివృఢుఁడై నొసముపురము వైపున కంతన్॥

క॥ పటుతర సాధనపటలో
ద్భటులయి, రిపుభటులు తరలివచ్చెడు విషయం
బిటవెంకన యంజనమున
స్ఫుటముగఁగని తెలుప రెడ్డి పుంగవుఁడంతన్॥

గీ॥ అంతికంబునఁగల చెర్వునందు నుండి
యగడితను నింపి మిగిలియున్నట్టి జలముఁ
దూములెత్తించి పాఱించి తొలఁగఁజేసెఁ
గడఁగి, పగతుర నీటియెద్దడిఁ గలంచ॥

క॥ వడిసెలల తోడఁబాఱుల
జడిగాఁ గుప్పించి శత్రుచయమును గగ్గో
ల్పడఁజేయు నేర్పరుల న
ల్గడలం భిత్తికల నిల్వఁగా నియమించెన్॥

గీ॥ పొంచి గుఱిజూచి యొక బాణముననె, శత్రు
మర్మభేదన మొనరించి మట్టుబెట్టు
లావుగలవారు విల్లంబులను ధరించి
వారికించుక వెనుక నిల్వంగ నునిచి॥

గీ॥ డంబుమీరుచుఁ గోటగోడలను జేరి
పైకి నెగఁబ్రాక యత్నించువారినెల్ల
సలసలంగ్రాగి మసలు నూనెలను జిమ్మ
కలఁచి మసిఁజేయఁదగు చక్కటుల నమర్చి॥

గీ॥ అంచితంబుగ నిటుల వ్యూహంబు పన్ని
యితర కృత్యంబులను నిర్వహింపఁదగిన
వారి నియమించి, యన్ని యేర్పాట్లుగనుచు
సిద్ధమగుచుండె నాతండు యుద్ధమునకు॥

చ॥ అనితర సాహస ప్రథితుఁడౌ, యతఁడీగతి నుండ, శత్రువా
హినులొక కొంతదూరముననే యరుదెంచుచునున్నవంచు, వెం
కన యెఱిగింప, రెడ్డివరుఁడప్పుడు, దృష్టినిగిడ్చి చూడఁగాఁ
గనపడె, రింఖదశ్వఖురఘట్టన జాతమహీరజశ్ఛటల్॥

క॥ అరసి తన యనుచరుల హె
చ్చరికం గావించుచుండ, శాత్రవసైన్యం
బరుదెంచి, చటులధాటీ
స్ఫురణంబున మెరసి కోట ముట్టడి గొనియెన్॥

చ॥ వడిసెలఱాల్ శరంబులు తుపాకుల గుండ్లును రెడ్డి సైన్యముల్
వడిఁగురిపింపఁజొచ్చె, జడివానగ దుర్గమునుండి; హూణులుం
బెడిదముగా శతఘ్నికలు ప్రేల్చుచు, భీషణ మారణాస్త్రముల్
విడుచుచుఁ బోరసాగిరి, కడిందిమగంటిమి, కచ్చమీరగన్॥

చ॥ ఇవతలినుండి దుర్గమున కేయొకవస్తువు చేరకుండ రే
బవలును కావలిన్నిలిపి, వాట్సను ముట్టడి గట్టిచేసి యు
ద్ధవిడిఁ బెనంగుచుండ, నుచితజ్ఞుఁడు రెడ్డియు, యుక్తరీతి నా
హవ మొనరించుచుండగ, నహస్సులుకొన్ని గతించె
నీగతిన్॥

సీ॥ అంతట వైశాఖ మరుదెంచె-రేనాఁట
మలమలలాడు నెండలకు, వడకు
నలవాటులేకుంట, నాత్మసైన్యంబులు
దిటవేది పొగులుచుండుట గ్రహించి,
యదిగాక, తత్ప్రాంతమందలి కూపంబు
లందు క్రమముగ నడుగంటి, నీటి
కఱవేర్పడుచునుంట గమనించి-'యికమీద
నిటనిల్చి ముట్టడించుట, యసాధ్య

గీ॥ మనుచుఁ' దలపోసి, యాంగ్లసైన్యాధినేత
దుర్గభేదన మొనరించి, దొమ్మిదూకి,
పోరి, యప్పటి సంగరంబును ముగించి
సత్వరంబుగ వెడల నిశ్చయమొనర్చి॥

గీ॥ ఆశ్రమున ముందువెనుకల నరయఁబోక
యతఁడు, తనకున్న మందుగుండ్లన్నికూడ
నెడతెలుపిలేక గుప్పంచి దొడరెఁగాని
కోట గోడ యొకింతయుఁ గూలదయ్యె॥

గీ॥ నాఁడు, వారికి "బళ్ళారి" నగరమందు
యుద్ధ వస్తుల గిడ్డంగులుండెఁ గాన
నచటివారికి "మందుగుండ్లంపుఁ" డనుచు
వార్తనంపించెఁ గర్నలు వాట్సనంత॥

గీ॥ ఔకురాజునకీవిషయంబుఁ గూఢ
చారులెఱిగింపఁ దగుదండు సంతరించి
పంపి దోపించె, బళ్ళారివైపునుండి
శకటముల మీదవచ్చు తత్సాధనముల॥

క॥ జరిగిన యీ వృత్తాంతము
నరసింహారెడ్డి వర్యునకు వివరముగా
నెఱిగింప లేఖనంపెను
త్వరితంబుగ నొక్కకార్యదక్షుని వెంటన్॥

గీ॥ వాఁడు తగు సాధనములతో బయలుదేరి,
యర్ధనిశికెల్ల నొసమున కరిగి శ్వేత
ముఖదళంబులు నిద్దుర మునిగియుంట
గాంచి, మెల్లగఁగోట దగ్గరికిఁ జేరి॥

గీ॥ రాజొసంగిన లేఖ భద్రముగ నొక్క
బాణమునఁగట్టి కోటలోఁ బడెడునట్లు
వింటసంధించి, విడిచి, తావెడలెఁ దిరిగి
కటికిచీకటి నందరి కనులఁ బ్రామి॥

ఆ॥ వె॥ భటుఁడొకండు, సుప్రభాత సమయమునందు
దుర్గమందుఁబడిన తూపుఁగాంచి
తనకొసంగ, రెడ్డి జనవరేణ్యుఁడు విప్పి
సంభ్రమమున లేఖఁ జదువుకొనుచు॥

చ॥ అనుపమ కార్యతంత్ర సమయజ్ఞత, నాత్మసఖుండొన
ర్చిన పనికెంతయునుమ్మదముఁజెంది, తదీయ హితానురక్తి నె
మ్మనమునఁ బ్రస్తుతించి, రిపుమర్మ విదుండగుటం దదీయసే
నను, బహిరంగ సంగరమున న్నుఱుమాడఁదలంచి
యంతటన్॥

చ॥ భటులకుఁ దెల్పి దుర్గము కవాటములం దెరిపించి కార్యలం
పటుఁడగు రెడ్డి వీరుఁ డొక భవ్యతరోన్నత వాజినెక్కి యు
ద్భటముగ హూణవాహినులపైఁబడి యుద్ధ ముపక్రమించి యం
తటఁ జెరలాడె, శత్రుభయదంబుగ నుగ్ర నృసింహమూర్తియై॥

ఉ॥ అందినవానినెల్ల హతమార్చుచు నందనివాని కోసమై
ముందునకేగుచుం, సమరభూమి, విలుంఠిత శత్రుకంఠని
ష్యందకవోష్ణ రక్తకలితాంగకుఁడై, వెలుగొందె, గ్రీష్మ మ
ధ్యందిన చండదీధితి విధంబునఁ జూడ్కికి దుర్నిరీక్షుఁడై॥

ఉ॥ కచ్చకుఁ గాలుద్రువ్వి. రిపుకాండము భీకరఖండనంబునం
దచ్చి, తదీయ రక్తముల స్నానములాడుట కుత్సహించు, న
య్యచ్చపుబోయదండు వివిధాయుధముల్ గొని రెడ్డి వెంబడిన్
వచ్చి కలంచఁజొచ్చెఁ బ్రతిపక్షబలంబులఁ బిచ్చలించుచున్॥

మ॥ తొడ బల్ గొట్టుచు బొబ్బరించుచును, శత్రుశ్రేణులంజీల్చి న
ల్గడలన్ ముట్టుచు, వైరియోధ మథనోగ్రస్ఫూర్తి వాటంబు వెం
బడిఁ గేలంగరవాలతోమర గదాభల్లాదులందాల్చి, బి
ట్టడరం బోరగఁజొచ్చిరందరు రణవ్యాపార పారీణతన్॥

సీ॥ నడుము డాపలనున్న యడిదంబుఁ జేఁబూని
శిరములు పైకెగఁజిమ్మి జిమ్మి
మొలనున్న పిడిబాకు వలనొప్పఁ ధరియించి
కుత్తుక క్రోవులం గోసిగోసి
వెస, భుజంబుననున్న వేట కొడవలిదాల్చి
కరములు పాదముల్ నఱికి నఱికి
తురగంబుపై భద్రపఱచిన బల్లెంబుఁ
గొని, వడి ఱొమ్ములం గ్రుమ్మి గ్రుమ్మి

గీ॥ దక్షవాటీ భయానకోద్దండమూర్తి
వీరభద్రుని యపరావతారమనఁగఁ
జండతేజుండు, రెడ్డి వీరుండు, సమర
తలము పీనుఁగుపెంటగా సలుపఁదొడఁగె॥

ఉ॥ ప్రాకట విక్రమక్రమ పరంతపుఁడాతఁడు హుంకరించుచుం
బైకొని, కేలనున్న కరవాలునకుం క్షణమేని విశ్రమం
బీక, రణోర్వియెల్లఁ జరియించుచు నొక్కనిఁగూడ జాఱిపో
నీక వధింపఁజొచ్చె, రిపుబృందముపాలిటి కాలమృత్యువై॥

ఉ॥ వంచనతోడ రాజ్యపరిపాలనముంగొని మేనులింతయున్॥
వంచక భారతోర్వి విభవంబుల దత్తకుమారులట్లు భో
గించు దురాత్ములన్ మిము ముగించి, ముగించెద నేటి
సంగరం;
బంచుఁ దటిత్ప్రయోద పటలానుగుణ ధ్వనినార్భటించుచున్॥

ఉ॥ అంచితరీతిఁ గేల నుచితాయుధముం ధరియించుచుం, విజృం
భించి నృసింహరెడ్డి యిటు స్వీయబలంబులఁ దాకుచుం బటా
పంచలొనర్చుచున్న నటు, వాట్సను, ప్రాణభయంబుతో, నుడా
యించె, స్వకీయ బాధ్యత నొకింతయు నెంచక వారువంబుపై॥

ఉ॥ దూరమునుండి యంత్రములతో రిపుఁగూల్చె కాని శౌర్యమే
పార ముఖాముఖిం బెనగునట్టి మగంటిమిలేమి, వారలె
వ్వారికి వారలై దెసలువట్టుచుఁ బర్విరి, రెడ్డి వీరు పెం
పారసి యాంగ్లసైనికులు, వ్యాఘ్రముఁగన్న కురంగముల్
బలెన్॥

గీ॥ ప్రాణములువీడి కొందరు యమగృహంబుఁ
బ్రాణభయమున మఱికొంద రాత్మగృహముఁ
జేర వెడలంగ, శత్రునిశ్శేషమైన
రణతలము వీడి, రెడ్డి, దుర్గమును జేరె॥

చ॥ ఇటుల జయంబుఁగాంచి, పరితృప్తి వహించి, యథోచితంబుగా
భటులను దన్పి, భవ్యగుణ బంధురుఁడాతఁడు, రెడ్డి సత్తముం
డటుపయి సంభవింపఁగల యాంగ్లబలంబుతోటి కయ్యముం
బటుగతి నిర్వహింప, మది భావనసేయఁదొడంగె నీగతిన్॥

గీ॥ ఈ నొసము ప్రాంతమెల్ల మైదానమగుట
వైరియూధంబులకు దురాపంబుకాదు
కాన, నిటనుండి కార్యరంగమును మార్చు
టురవటంచును, తత్క్రియాపరతఁదనరె॥

# సవరణలు

| పుట: | పంక్తి: | తప్పు: | సవరణ: |
|---|---|---|---|
| 1 | 10 | నముదాయం | సముదాయం |
| 3 | 8 | ప్పగురు | ప్పదుగురు |
| 7 | 10, 11 | గోషిని | గోష్ఠిని |
| 13 | 8 | సాధ్వులం | సాధ్వులు |
| 15 | 14 | పాడుపడినవి | పాడుపడ్డవి |
| 18 | 11 | వాద్రికము | వాలకము |
| 25 | 14 | ఆజ్ఞసేయుచుఁ | ఆజ్ఞసేయుచుం |
| 27 | 15 | నికఁ | నింకఁ |
| 41 | 5 | ప్రధితుఁడు | ప్రథితుఁడు |
| 44 | 9 | సమయమునందు | సమయమున |
| 48 | 1 | యధోచితంబుగా | యథోచితంబుగా |